# పాఠశాల విద్యాశాఖ, తెలంగాణ రాష్ట్రం, హైదరాబాదు

## శ్రీ టి. విజయ్‌కుమార్, ఐ.ఏ.ఎస్., కమీషనర్ గారి ఉత్తర్వులు

ఉత్తర్వు సంఖ్య :**3117/TSS/Pdg/T6/2019** తేది:6|07.2019

**విషయం:** పాఠశాల విద్యాశాఖ, తెలంగాణ రాష్ట్రం-3, 4, 5, 6, 7 తరగతుల విద్యార్థులకు కనీస సామర్థ్యాలను నేర్పడానికి **"Attainment of Basic Competencies-(ABC)"** (మూలాల్లోకి వెళదాం) కార్యక్రమాన్ని అన్ని పాఠశాలల్లో నిర్వహించడం-కార్యాచరణ ప్రణాళిక గురించి

xxx

పై విషయం పురస్కరించుకొని జిల్లా విద్యాధికారులకు తెలియజేయునది ఏమనగా 2019-20 విద్యా సంవత్సరం కోసం 'బడి బాట' కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల ఉనికిని, గొప్పదనాన్ని సమాజంలోకి తీసుకెళ్ళి పిల్లల నమోదును పెంచడానికి కృషి చేసిన వారందరికి అభినందనలు. నమోదు కార్యక్రమం అనంతరం పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసనం మీద దృష్టిపెట్టాల్సిన అవసరం ఉంది.

బడిలో చేరిన పిల్లలందరూ వారు చదువుతున్న తరగతికి చెందిన సబ్జెక్టువారీ సామర్థ్యాలను, అభ్యసనా ఫలితాలను సాధించాలి. ఇది పిల్లల స్థాయితో ముడిపడిన అంశం. పిల్లలు తాము చదువబోతున్న తరగతిలో చేరడానికి అవసరమైన కనీస స్థాయిలను కలిగివున్నప్పుడే ఆ తరగతికి నిర్దేశించిన తరగతివారీ సామర్థ్యాలను, అభ్యసనాఫలితాలను సాధించగలుగుతారు. తరగతి ఏదైనా, సబ్జెక్టు ఏదైనా బోధిస్తున్న ఉపాధ్యాయుడు బోధనాంశానికి చెందిన ప్రాథమిక పరిజ్ఞానాన్ని పిల్లలందరూ కలిగివున్నారా? లేదా? అని పరిశీలించడం బోధనలో ప్రాథమిక అంశం. ఈ అవగాహనతోనే తాము ఎక్కడి నుండి బోధన ప్రారంభించాలి? బోధిస్తున్న విషయాన్ని పిల్లలకు ఎలా అందించాలి? అనే అంశాలు ముడిపడి ఉంటాయి. దీని ప్రాధాన్యతను అర్థంచేసుకున్న ఉపాధ్యాయులు తమ సబ్జెక్టులలో ఉన్నత ఫలితాలను సాధించి పిల్లలకు నాణ్యమైన విద్యనందించగలుగుతున్నారు.

ఈ మధ్య కాలంలో పిల్లల స్థాయి గురించి జరిగిన వివిధ అధ్యయనాల ఫలితాలు కొంత ఆలోచింపజేసేలా ఉన్నవి. జాతీయ స్థాయి సాధనాపరీక్ష (National Achievement Survey)-2017 ప్రకారం 3, 5, 8 తరగతుల్లోని విద్యార్థుల భాషాస్థాయి, గణితంలోని స్థాయి, ఆందోళన కలిగించేదిగా ఉంది. ప్రతీ సంవత్సరం ప్రథమ్ సంస్థ నిర్వహించే అధ్యయనాల్లో కూడా ఫలితాలు ఇదే విధంగా ఉన్నవి. చదువడం, రాయడం, గణితంలో చతుర్విధ ప్రక్రియలు చేయగలగడం వంటివి ప్రాథమిక తరగతులు పూర్తయ్యేసరికి పిల్లలు సాధించాల్సిన సామర్థ్యాలు. వీటిని కలిగివున్న పిల్లలు ప్రాథమికోన్నత స్థాయి నుండి వివిధ సబ్జెక్టులను నేర్చుకోవడంలో ముందుంటున్నారు. కాబట్టి 3వ తరగతి నుండి 7వ తరగతి వరకు విద్యార్థులందరూ భాషలో, గణితంలో కనీస స్థాయిలను కలిగివుండడం అత్యంత ముఖ్యమైనదిగా భావించాలి. వీటిని సాధించడం ప్రాథమిక లక్ష్యంగా భావించి సాధించాలి.

**2019-20 విద్యా సంవత్సరంలో జూలై మొదటి వారం నుండి 3 నుండి 7వ తరగతి విద్యార్థులందరూ మాతృభాష, గణితం, ఆంగ్ల భాషల్లో ఆయా తరగతుల్లో కొనసాగడానికి అవసరమైన కనీస సామర్థ్యాలను సాధించేలా పాఠశాలల వారీగా కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకొని అమలుపరచాలి. కనీసం 45 రోజుల నుండి గరిష్ఠంగా 60 రోజుల్లోపల వీటిని సాధించాలి.**

ఇందుకోసం 2017-18 విద్యా సంవత్సరంలో పాఠశాల విద్యాశాఖ కమిషనర్ మరియు సంచాలకుల గారి నుండి స్పష్టమైన ఉత్తర్వులను (ఉత్తర్వు సంఖ్య : 471/ఆర్.ఎమ్.ఎస్.ఎ./టి.ఎస్./2015, తేది : 14-07-2017) ఇచ్చివున్నారు. కనీస సామర్థ్యాల సాధన కోసం స్పష్టమైన కార్యాచరణతో కూడిన ఉపాధ్యాయుల కరదీపికను కూడా అందించారు. ప్రధానోపాధ్యాయులందరికీ శిక్షణా కార్యక్రమాలను నిర్వహించారు. ఆగష్టు మాసం నుండి దీనిని అమలుపరచి మంచి

Scanned by CamScanner

ఫలితాలను కూడా సాధించారు. అయితే, దీన్ని పూర్తిస్థాయిలో అమలుపరచి ప్రతి పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది తమ పాఠశాలల్లో విద్యార్థులందరూ కనీస సామర్థ్యాలను కలిగివున్నారని ఆత్మవిశ్వాసంతో ప్రకటించగలిగేలా 2019-20 విద్యాసంవత్సరంలో స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికతో ముందుకు వెళ్ళాలి. దీనికి సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను పరిశీలిద్దాం.

## కార్యాచరణ ప్రణాళిక

**పాఠశాల స్థాయిలో చేపట్టాల్సినవి**

- ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, కె.జి.బి.వి. పాఠశాలల్లో **Attainment of Basic Competencies-ABC** (మూలాల్లోకి వెళదాం) కార్యక్రమాన్ని 2019 జూన్ మాసం నుండి అమలుచేయాలి.
- 3వ తరగతి నుండి 8వ తరగతి వరకు విద్యార్థులందరికీ తెలుగు / మాతృభాష, ఆంగ్లం, గణితంలో కనీస సామర్థ్యాలు సాధించేలా కార్యక్రమాన్ని నిర్వహించాలి.
- తెలుగు / మాతృభాషలో విద్యార్థులందరూ ధారాళంగా చదువడం, చదివినదాన్ని అర్థం చేసుకోవడం, తప్పుల్లేకుండా సొంతంగా రాయడం చేయగలిగేలా చూడాలి.
- ఆంగ్లంలో కూడా విద్యార్థులందరూ ధారాళంగా చదువడం, చదివినదాన్ని అర్థం చేసుకోవడం, తప్పుల్లేకుండా సొంతంగా రాయడం చేయగలిగేలా చూడాలి.
- గణితంలో కూడికలు, తీసివేతలు, గుణకారం, భాగహారం లెక్కలను విద్యార్థులు చేయగలగాలి.
- ఇందుకోసం జూలై మాసంలో మొదటి వారంలో విద్యార్థుల స్థాయిలను తెలుసుకోవడానికి ప్రారంభ పరీక్ష (Pre-test)ను తెలుగు, ఆంగ్లం, గణితంలో నిర్వహించాలి. (ప్రారంభ పరీక్ష ప్రశ్నాపత్రాలను అందిస్తారు.)
- ప్రారంభ పరీక్ష ఆధారంగా విద్యార్థులు తెలుగు / మాతృభాష, గణితం, ఆంగ్లంలలో కనీస సామర్థ్యాలు కలిగినవారిని, లేనివారిని గుర్తించాలి. తరగతివారీగా విద్యార్థుల జాబితాలను రూపొందించాలి.
- సామర్థ్యాల వారీగా కింది పట్టికలో చేయగలిగితే (✓), చేయలేకుంటే (✗) తో గుర్తించాలి.

| క్ర.సం. | విద్యార్థి పేరు | తరగతి | తెలుగు / మాతృభాష | | ఆంగ్లం | | గణితం | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | | చదువడం | రాయడం | చదువడం | రాయడం | కూడిక | తీసివేత | గుణకారం | భాగహారం |
| | | | | | | | | | | |

- పై పట్టికలోని ప్రారంభ పరీక్ష సమాచారాన్ని ప్రాథమిక ప్రాథమికోన్నత స్థాయిలో CRP లు సేకరించి మండల MIS సహకారంతో ఆన్‌లైన్ అప్‌లోడ్ చేయాలి. ఉన్నత స్థాయిలో ప్రధానోపాధ్యాయులు ప్రారంభ పరీక్ష ఫలితాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి.
- పాఠశాల ప్రధానోపాధ్యాయులు తరగతి వారీగా విద్యార్థుల జాబితాను పరిశీలించి ఉపాధ్యాయులతో చర్చించాలి.
- పాఠశాలల వారీగా ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు కలిసి కనీస సామర్థ్యాలు లేని పిల్లలకు మూలాలను నేర్పడానికి ఏ సమయంలో నేర్పాలి? ఎవరెవరు ఏయే బాధ్యతలను స్వీకరించాలనే అంశాలను చర్చించి ప్రణాళికను రూపొందించుకోవాలి. దానిని అమలుపరిచేలా ప్రధానోపాధ్యాయుడు బాధ్యత వహించాలి.
- 10/15 రోజులకు ఒకసారి కనీస సామర్థ్యాల సాధనను గురించి స్లిప్ టెస్టులను నిర్వహించాలి. వీటి ఫలితాలను ప్రధానోపాధ్యాయుడు సమీక్షించాలి. తదుపరి లక్ష్యాలను నిర్ధారించాలి.
- కనీస సామర్థ్యాలు లేని పిల్లలకు మూలాలను నేర్పే సమయంలో మిగతా విద్యార్థులు నష్టపోకుండా వారి స్థాయికి తగిన కృత్యాలు / పనులతో పిల్లలను అభ్యసనంలో నిమగ్నం చేయాలి.

Scanned by CamScanner

- మూలాలను నేర్పే సమయంలో పాఠశాలలో రెగ్యులర్ సిలబస్‌కు విఘాతం కలగకుండా పాఠశాలల వారీగా ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ప్రణాళిక చేసుకోవాలి. అయితే, ప్రాథమిక పాఠశాలల్లో ఉదయం లేదా సాయంత్రం ఒక పూట రెగ్యులర్ సబ్జెక్టులను బోధించి మరొక పూట మూలాలను నేర్పించాలి. పాఠశాలలోని ఉపాధ్యాయులందరు గ్రూపులను దత్తత తీసుకొని కార్యక్రమాన్ని నిర్వహించాలి.
- వీటి గురించి అవగాహన కార్యక్రమాలను స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు స్కూల్ కాంప్లెక్సులలో నిర్వహించాలి.
- గణితంలో 4 ప్రక్రియలు రాని విద్యార్థులు 3, 2, 1 ప్రక్రియ రాని విద్యార్థులను గ్రూపులుగా విభజించి సమ వయస్కులను బోధన అభ్యసనకుగా విభజించి సమ వయస్కుల బోధన అభ్యసనకు (Peer group learning) ఎక్కువగా అవకాశం ఇచ్చి, ఎక్కువ అవసరమున్న పిల్లలకు ఉపాధ్యాయులు ప్రత్యక్షంగా శ్రద్ధ తీసుకొని బోధించాలి.
- **3, 4, 5 తరగతుల తెలుగు వాచకాల్లో సంసిద్ధతా పాఠాలను చేర్చారు. వీటి ఆధారంగా పిల్లలకు చదువడం, రాయడం గురించి అభ్యాసం కల్పించి నేర్పించాలి.**
- వారంలో ఒకరోజు పిల్లలు ఏమేమి చేయగలుగుతున్నారో వారే గ్రహించేలా ప్రదర్శనలు ఏర్పాటు చేయాలి.
- పిల్లలను కించపరచడం, లేదా చేయగలిగినవారితో పోల్చడం ఎట్టిపరిస్థితుల్లో చేయకూడదు. వారిని ప్రోత్సహించడానికి తరగతి వారీగా కనీస సామర్థ్యాలను సాధించినవారి పేర్లను తరగతి గోడల మీద లేదా నోటీసు బోర్డు మీద ప్రదర్శించాలి. వేగంగా నేర్చుకున్నవారిని అభినందించడానికి అసెంబ్లీ సమయంలో లేదా పాఠశాలలో జరిగే సమావేశాల సందర్భంగా చప్పట్లతో ప్రోత్సహించాలి.
- పిల్లలకు కనీస సామర్థ్యాలను పాఠశాల సమయం అనంతరం నేర్పడానికి **గ్రామాల్లోని విద్యాధికులు / స్వచ్ఛంద సంఘాల సభ్యులు / చదువుకున్న యువతీ యువకులు / పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయులు / ఉద్యోగుల** సేవలను వినియోగించుకోవాలి. పదవీ విరమణ చేసిన వారు (retired but not tired) వయస్సు రీత్యా ఉద్యోగ బాధ్యతలను తప్పుకోవచ్చు. కాని వారిలోని సేవాభావాన్ని మనం వినియోగించుకోవడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చు.
- **అగస్టు 31 తేది వరకు Attainment of Basic Competencies-ABC (మూలాల్లోకి వెళదాం) కార్యక్రమాన్ని అతి ముఖ్యమైనదిగా భావించి తల్లిదండ్రుల సమావేశంలో అందరు విద్యార్థులు చేయగలిగారని ప్రకటించగలగాలి. అయితే 15 అగస్టు వరకు ఏ పాఠశాలల్లోనైనా పూర్తిగా సాధించి, ప్రకటించగల్గుతారో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులను రాష్ట్ర స్థాయికి ఆహ్వానించి పాఠశాలలకు అభినందన పత్రాలు అందజేస్తారు.**

**అభినందించడం / ప్రోత్సాహకాలు అందించడం**

- కనీస సామర్థ్యాలు అనగా చదువడం, రాయడం, చతుర్విధ ప్రక్రియలు చేయగల్గిన పిల్లలను ఆ పాఠశాల ఉపాధ్యాయులను గుర్తించి అభినందించడం ద్వారా ప్రోత్సాహక వాతావరణాన్ని ఏర్పరచాలి. దీనికి **ఎలాంటి ఆర్థిక భారం** ఉండదు. చప్పట్లు కొట్టించడం, వారి గురించి ప్రశంసించడం, దండలు వేయడం, దాతల సహకారంతో ప్రోత్సాహకాలు అందించడం వంటివి చేయాలి.
- ప్రతి బడిలో కనీస సామర్థ్యాలు అనగా చదువడం, రాయడం, చతుర్విధ ప్రక్రియలు చేయగల్గిన పిల్లలను గుర్తించి పాఠశాల అసెంబ్లీ, పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్.ఎం.సి.) సమావేశాల్లో వారిని, వారి తల్లిదండ్రులను చప్పట్లతో అభినందించాలి. దాతల సహకారంతో ఆ పిల్లలకు నిఘంటువులు / కథల పుస్తకాలు / సైకిళ్ళు వంటి వాటిని ఇవ్వడం ద్వారా ప్రోత్సహించాలి.
- కనీస సామర్థ్యాలు సాధించిన విద్యార్థుల పేర్లను తరగతుల వారీగా నోటీస్ బోర్డు నందు రాసి ప్రదర్శించాలి.

**బాల సాహిత్య వినియోగం**

- పిల్లల్లో కనీస సామర్థ్యాలను పెంపొందించడానికి పుస్తక పఠనం అతి ముఖ్యమైనది. ఇందుకోసం పాఠశాలల్లోని గ్రంథాలయ పుస్తకాలను, వార్తాపత్రికలను, మ్యాగజైన్లను పిల్లలకు ఇచ్చి చదివించాలి.
- భోజన విరామ సమయంలో పిల్లల స్థాయికి తగిన పుస్తకాలను ఇచ్చి చదివించాలి.

**మానిటరింగ్ మరియు సమీక్షలు**

Scanned by CamScanner

- స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, తమ పరిధిలోని అన్ని పాఠశాలలను 15 రోజులకు ఒకసారి సందర్శించి పిల్లల అభ్యసనాన్ని పరిశీలించేలా మానిటరింగ్ కార్యక్రమాన్ని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు రూపొందించాలి.
- మండల విద్యాధికారికి కూడా పాఠశాలలను సందర్శించి పిల్లల ప్రగతిని పరిశీలించాలి.
- జిల్లా స్థాయిలో జిల్లా విద్యాధికారి నెలకొకమారు సమీక్షాసమావేశాన్ని స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులతో నిర్వహించాలి. జిల్లా విద్యాధికారికి కూడా నెలలో ఒకమారు ప్రతి మండలాన్ని సందర్శించి ఒక ప్రాథమిక పాఠశాల, ఒక ప్రాథమికోన్నత / ఉన్నత పాఠశాలను సందర్శించి పిల్లల స్థాయిలను పరిశీలించాలి.
- జిల్లా స్థాయిలో సమగ్ర శిక్షా అధికారులు, జిల్లా విద్యాశిక్షణాసంస్థ ప్రధానాచార్యులు, ఉపన్యాసకులు, బి.ఇ.డి. కళాశాలల ఉపన్యాసకులు **Attainment of Basic Competencies-ABC (మూలాల్లోకి వెళదాం)** కార్యక్రమాన్ని అమలుపరచడంలో, మానిటరింగ్ చేయడంలో జిల్లా విద్యాధికారికి సహకరించాలి. జిల్లా విద్యాధికారి నేతృత్వంలో జిల్లా మానిటరింగ్ బృందాలను ఏర్పరచాలి. వీరు ఒక నెలలో ప్రతీ మండలాన్ని సందర్శించి కార్యక్రమం అమలు తీరుతెన్నుల గురించి జిల్లా విద్యాధికారికి నివేదికను సమర్పించాలి.
- జిల్లా సెక్టోరియల్ అధికారులు మండలాలను దత్తత తీసుకొని ఆయా మండలాలలో జరిగే ABC కార్యక్రమాల పర్యవేక్షించాలి.
- రాష్ట్ర స్థాయిలో ఎస్.సి.ఇ.ఆర్.టి.తో పాటు సమగ్ర శిక్షా అధికారులు దీంట్లో భాగస్వాములు కావాలి.
- ఆగష్టు చివరి వారంలో కనీస సామర్థ్యాల గురించి అంత్య పరీక్ష నిర్వహిస్తారు. కాబట్టి, ప్రతి పాఠశాలలో విద్యార్థులందరూ కనీస సామర్థ్యాలను సాధించగలిగేలా **Attainment of Basic Competencies-ABC (మూలాల్లోకి వెళదాం)** కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి.

ఈ సందర్భంలో తమరికి సమర్పించునది ఏమగా 2019-20 విద్యా సంవత్సరంలో పిల్లలందరూ కనీస సామర్థ్యాలను పొంది ఆయా తరగతులకు చెందిన వివిధ సబ్జెక్టులలోని అభ్యసనా సామర్థ్యాలను సాధించేలా కృషి చేయాలి. పాఠశాలల వారీగా ప్రణాళికలు రూపొందించుకొని అమలుపరచాలి. పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడు, కాంప్లెక్సు పరిధిలోని పాఠశాలలకు స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు, మండలానికి మండల విద్యాధికారి, జిల్లాకు జిల్లా విద్యాధికారి నేతృత్వం వహించి బాధ్యత వహించాల్సి ఉంటుంది. **Attainment of Basic Competencies-ABC (మూలాల్లోకి వెళదాం)** కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యమైనదిగా భావించి సత్ఫలితాలు సాధించాలి.

ఇందు మూలంగా పై విషయాలను తమరి పరిశీలనార్థం మరియు ABC కార్యక్రమ కార్యాచరణ ప్రణాళికలను సూచనలను సమస్త జిల్లా విద్యాధికారులు తెలియజేయుటకు మరియు అమలు పరుచుటకు తమరి అనుమతి నిమిత్తం సమర్పించనైనది.

**కమీషనర్, పాఠశాల విద్యాశాఖ &**
**రాష్ట్ర పథక సంచాలకులు, సమగ్ర శిక్షా**
**తెలంగాణ, హైదరాబాద్.**

**దీని ప్రతులు**

జిల్లా విద్యాధికారులందరికి తగు చర్యల నిమిత్తం.

Scanned by CamScanner